# ప్రోత్సాహం

ఇద్దరూ సైకిల్స్ రోడ్డు పక్కన లాక్‌చేసి వాటికున్న కాగితాలను తీసుకుని చంకలో పెట్టుకొని, స్వీట్ సెంటర్‌లోకి వెళ్లి కూర్చొని —

"బాబూ రెండు కళాకంద్" అన్నాడు రషీద్. అంతే నీళ్లగ్లాసులు వాళ్ళ టేబుల్‌పైకొచ్చి నిలుచున్నాయి.

''ఇంతకీ ఈ....'' వెంకన్న

"మా పెద్దవానికి నౌకరొచ్చింది!"

"నిజమా.... సంతోషం" అంటూ షేక్‌హాండ్ చేసి, నీళ్ళ గ్లాసును అందుకొని.... కొంచెం తాగి, అక్కడే టేబుల్ మీద పెడుతూ

"ఎందులో"

"జిల్లాపరిషత్‌లో వాచ్‌మెన్"

రెండు కళాకంద్ ప్లేట్స్ టేబుల్‌మీదికొచ్చాయి. అందులో తలకిందులుగా వున్న స్పూన్స్‌ను చేతుల్లోకి తీసుకొని స్వీట్స్ ను తింటూ—

"తండ్రి పోస్ట్‌మెన్, కొడుకు వాచ్‌మెన్" చిన్నగా నవ్వుతూ

''ఏదో నడవాలి అదీ రావడానికీ ఊ'' అంటూ రషీద్ వైపు చూశాడు.

''పోనీలే యిచ్చి బదనాం చెయ్యడందేనికి....''

వెంకన్న నవ్వాడు శబ్దంలేకుండా

''రెండు టీ'' అన్నాడు స్పూన్‌ను ప్లేట్లోకి వొదులుతూ

రెండు టీ గ్లాసులను తెచ్చి వుంచాడు బోయ్.

చెరో టీ తీసుకుంటు....

"యిక పెళ్ళి కూడా"

"తర్వాత పని అదే గదా...."

యిద్దరూ టీ తాగుడం పూర్తిచేశారు.

వెంకన్న పక్క కుర్చీలో పెట్టిన తన ఉత్తరాలను తీసుకుంటు ఉత్తరాలవైపు చూశాడు. అన్నింటి కంటే పైన ఓ రిజిష్టర్ పోస్ట్ లెటర్ కనిపించింది. కే. రామమూర్తి, ఇ.నెం. 7-7-77, లెనిన్ కాలనీ అని వుంది. దాన్ని చేతుల్లోకి తీసుకుని "పాపం యితను పది ఏండ్లనుండి బాధలు పడుతున్నాడు. బాగా చదువుకున్నవాడు. యిప్పటి వరకు ఏ ఉద్యోగం రాలేదు. కాల్‌లెటర్స్ కోసం ఎప్పుడు ఎదురుచూస్తుంటాడు. మరి ఈ సారి జిల్లా విద్యాశాఖాధికారిగారి నుండి రిజిష్టర్ పోస్ట్‌వచ్చింది. ఏదైనా ఉద్యోగం వచ్చిందో.... రోజూ అతను అదోలాగా అడిగినప్పుడల్లా కడుపులో దేవినట్లు అనిపిచ్చేది. నారాకకు ఎదురు చూస్తుంటాడు. త్వరగా వెళ్ళి ఈ ఉత్తరం యిద్దాం. "శుక్రియా అవుర్ ముబారక్" అంటూ లేచాడు వెంకన్న. రషీద్ కౌంటర్ దగ్గరిక్క వెళ్లి బిల్లుచెల్లించి వచ్చేసరికి వెంకన్న సైకిల్ కదిలింది. రషీద్ తన రూట్ వైపు వెళ్ళాడు.

తాగుడు వల్ల కండలు కరిగి కడుపు లావెక్కింది. కళ్లు పీక్కుపోయి ముఖం ఉబ్బిపోయి తూలుతూ జనం మధ్యలోకి వచ్చి పెదాలను అతి కష్టంగా కదిలిస్తూ "ఏంటీ సచ్చాదా?"

ఎందుకు సచ్చాడు, బతకాలని ప్రభుత్వం మంచినీళ్లిస్తుంది. బతకమని ప్రభుత్వం రేషన్‌కార్డ్సు యిస్తుంది. తాగమని కల్లు సారా ప్రభుత్వమే అమ్మితుంది. చావకుంట బతకమని దవాఖానాలు పెట్టింది.'' అటు యిటూ చూస్తూ అందర్ని తోసుకుంటూ ''ఎవడ్ర సచ్చింది - పిరికి సన్నాసీ, బతకలేని వాడు ప్చ్-ప్చ్.'' అంటూ శవాన్ని చూసి జనం వైపు మళ్ళీ

''మన అమ్మా, నాన్నలు మనల బతకమని ఉగ్గుపెట్టి పెంచారు. చేయి పట్టి నడక నేర్పారు. కష్టపడి చదివించారు. బతకమంటే చావడందేనికి?'' అంటూ తూలే శరీరాన్ని నిల దొక్కుకుంటు అతి కష్టంగా మాటలను పలుకుతున్నాడు. మళ్లీ శవం వైపు వంగి ముఖంలోకి చూసి తాను ఏడ్వసాగాడు ఓ తాగుబోతు. ఈయన ఉదయం లేవగానే సారాయితో నోరు కడుగుతాడు. రాత్రి పడుకునేటప్పుడు సారాయే! ఈయనకు ఆకలైనా సారాయే! దూపయినా సారాయే.

"ఎలా సచ్చాడు" వెంకన్న ప్రశ్న.

''ఉరేసుకుని'' పక్కనేనిలుచున్న పన్నెండేండ్ల కుర్రవాని జవాబు. వెంకన్న కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. పదేండ్ల నుండి తనకు ఏదన్నా కాల్ లెటర్స్ వచ్చాయా అని అడిగే మూర్తి సచ్చాడా. అయ్యో రిజిష్టర్ పోస్ట్ వొచ్చిందే అనుకుంటు చుట్టూ చూశాడు.

ఈ కవరులో ఏముందో నిన్ను ఇంటర్వ్యూలో ఎన్నిక చేసుకోనందుకు చింతిస్తున్నాము అని కావచ్చు అనుకున్నాడు వెంకన్న.

"ఏం లెటరో'' గుంపులో నుండి ఒకరు.

"ఏం లెటర్ అయితే ఏంది అసలోడు పోయాక'' మరొకరు.

"యిప్పి చూడండి."

"ఇది రిజిష్టర్ లెటర్ ఎకనాలెడ్జ్‌డ్యూ— ముందు పార్టీ సంతకం కావాలి.''

''సచ్చినాక సంతకం'' అంటు తన అనుమానాన్ని వెలిబుచ్చాడు.

వెంకన్న ఇరవై ఐదేండ్ల సర్వీసులో ఇలాంటి సమస్య ఎప్పుడూ ఎదురు కాలేదుతనకు.

అవును అదీ నిజమే అని అందరూ గుస గుస అనుకున్నారు. గుంపులో నుండి వొకరు వొంచి వదిలిన పెదురుబద్దలా లేచి వెంకన్న దగ్గరికి వస్తూ

"ఏమయ్యా, పోస్ట్ బాబూ సంతకానికి ఛస్తే ఏం, బతికితే ఏం కావల్సింది మనకు సంతకమే కదా యిట్లాతే_" అంటు

పోస్ట్‌మెన్ చేతిలోని కవర్‌ని లాక్కొని ప్రక్కవాడి జేబులోని పెన్ తీసుకుని శవం దగ్గరికి వెళ్ళి అతని అద్దుడు వేలుకు యింకు పూసి ఎకనాలెడ్జ్ రిసీట్‌పై ఒత్తి, చాలుగద యిది ఆయన సంతకమేయిక యిప్పండి" అంటుతీసుకున్న పెన్‌ను ప్రక్కనేనిలుచున్న మునిసిపల్ బిల్‌కలెక్టర్‌కిచ్చి ఎండిపోతున్న పెదాలను నాలికతో తడుపుకుంటు నిలుచున్నాడు ఈ ఐడియా ఒకతాగుబోతుకు తట్టినందుకు అందరూ ఆశ్చర్యపోయారు. వెంకన్న ఏమన లేక బొమ్మలా నిలుచున్నాడు.

కవర్‌విప్పి చదవసాగాడు.

సర్,

సబ్‌జెక్ట్—

రెఫరెన్స్—    మీ దరఖాస్తు తేది 1-1-1985

పై సబ్‌జెక్ట్‌ను అనుసరించి మీ దరఖాస్తు పరిశీలించి, మీ విద్యార్హతలను గుర్తించి, మిమ్ములను ప్రత్యేకస్కేలు ఉపాధ్యాయులుగా కన్‌సొలిడేట్ పే రూ. 398/– లో నియమించడం జరిగింది. కావున వెంటనే పనిలో చేరేనిమిత్తం మా కార్యాలయానికి రావల్సిందిగా కోరడమైనది.

జిల్లా విద్యాశాఖాధికారి

శవం పక్కనే కూర్చున్న ముదుసలి తల్లి "కొడుకో నీకు ఉజ్యోగం వచ్చిందిరో" అంటు గొల్లున ఏడ్చింది. ఆమె ఏడ్వగానే మరెందరో ఆడవాళ్ళు ఏడ్చారు. తల్లి ఏడుస్తు మాటిమాటికి కొడుకు ముఖాన్ని చూస్తూ దేవుళ్లను తిడుతుంది. తన కడుపున ఆ కొడుకును పుట్టించినందుకు వాణ్ణి పెంచడంలో ఎదురైన కష్టాలు గుర్తుచేసుకుని తిడుతూవుంది. పుట్టగానే తన భర్తను తీసుకుపోయి యిన్ని కష్టాలపాలు చేసినందుకు మరీ మరీ తిడుతుంది. వెంకన్న శిలలా నిలుచున్నాడు. ఈ ఉత్తరం ఒక్కరోజు ముందొస్తే మూర్తి బతికేవాడుగదా అను కున్నాడు.

శవానికి ఉద్యోగం వచ్చినందుకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. అయినా ఉద్యోగం రానంత మాత్రాన మూర్తి ఎందుకు చావాలి?

"పాపం చదివేటప్పుడు ఎంతో కష్టపడ్డాడు. రోజూ న్యూస్ పేపర్లు పంచేవాడు, సోడాబండి నడిపేవాడు. తిరిగి స్కూల్ టైమ్‌లో స్కూల్‌కెళ్లేవాడు. బిడ్డనికి బతికినన్నాళ్ళూ కష్టాలే" అన్నాడు పక్కనే నిలుచున్న ఓ నడివయస్సు వ్యక్తి, ఈయన కు మెయిన్ బజార్లో పాన్‌షాప్ వుంది.

"పేద కొంపలో పుట్టినాక కష్టాలు తప్పవు వాటిని తట్టు కోవాలి" వెంకన్న

"ఏం తట్టుకోమంటారు. కనీసం పూటైనా గడవదాయె.." ఒకరు.

"కట్టెలు కొట్టయినా బతకొచ్చు, కంకర కొట్టయినా బత కొచ్చు, సచ్చి ఏం సాధించాడు ముసలమ్మను ముంచి పోయిండు." అంది మరో ముసలమ్మ

"ఆ పనీ చేసేవాడు, కానీ ఆ చదువుంది చూశారూ ఆ ఎం.ఏ. ఏ పనిచేయాలన్నా అడ్డొచ్చి కొంత...." అంటు బరు వైన గుండెతో వెంకన్న ఆక్కడి నుండి కదిలి–

పోస్ట్‌మార్టమ్ చేయించడానికి వొస్తున్న పోలిస్ వాళ్ళవై పుచూస్తు "అసలు పోస్టుమార్టం వల్ల ఎలా చచ్చాడో తేలుద్ది కానీ ఎందుకు చచ్చాడన్నది తేలదు కదా!?" అనుకుంటు తన సైకిల్ వున్న వైపు నడిచాడు.

○